ముప్పేట దాడితో అన్నదాత చిత్తు

- మినుము రైతులను వెంటాడుతున్న కష్టాలు
- మినుములో మూషికాల బెడద
- నిర్మూలనకు అదనపు పెట్టుబడులు
- సాగు వ్యయం పెరగడంపై రైతుల ఆందోళన

కంకిపాడు: మూలిగే నక్కపై తాడిపండు పడిన చందంగా మారింది మినుము రైతుల దుస్థితి. ఓ వైపు దిగుబడులు ఆశాజనంగా లేకపోగా, మార్కెట్‌లో ఆశించిన ధర లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో పైరుపై మూషికాలు దాడి చేస్తున్నాయి. పంట చేతికొచ్చే తరుణంలో ఎడాపెడా పైరును ధ్వంసం చేస్తూ నష్టం చేస్తున్నాయి. దీంతో చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు మినుము రైతులు అవస్థలు పడుతున్నారు.

2.84లక్షల ఎకరాల్లో సాగు..

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రబీ సీజన్‌లో 2,84,237 ఎకరాల్లో మినుము సాగు చేపట్టారు. ఎల్‌బీజీ, పీయు 31, టీబీజీ, ఇతర విత్తన రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మినుము తీత, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులు ముందస్తుగా రెండో పంట సాగుకు ఉపక్రమించారు. ఖరీఫ్ వరి కోతలు అనంతరం మినుము సాగు చేపట్టిన పొలాల్లో మాత్రం పైరు కాయదశలో ఉంది. నెలాఖరుకి మినుముతీతలు చేపట్టే అవకాశం ఉంది.

కష్టం.. నష్టం..

సాగు ఆరంభం నుంచి ఈ సీజన్‌లో మినుము రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా పంటకు పల్లాకు తెగులు ఆశించి తీవ్ర ప్రభావం చూపింది. మచ్చల పురుగు, తెగుళ్ల ఉధృతి కారణంగా పంట దిగుబడులు దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.25 వేలు వరకూ పెట్టుబడులు కాగా, తెగుళ్ల, పురుగుల నిర్మూలన చర్యలకు పైపాటు పనులకు మరో రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకూ రైతులకు పెట్టుబడులు తప్పలేదు. ముందస్తుగా సాగు చేసిన పొలాల్లో మినుము తీత పనులు చేపడుతుండగా ఎకరాకు సరాసరిన 6 నుంచి 8 బస్తాలు వరకూ దిగుబడులు వస్తున్నాయి. అయితే మార్కెట్‌లో ధర మాత్రం ఆశాజనకంగా లేదు.



నెప్పల్లిలో ఎలుకల నిర్మూలనకు మినుము పొలంలో బుట్టలు పెడుతున్న కూలీ

రూ.7,400 మించని ధర..

మినుము మద్దతు ధర రూ.7,400 ఉంటే అదే ధరకు కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది రూ.9,800 వరకూ ధర పలకడంతో, అదే ధర దక్కుతుందని ఆశించిన రైతులకు తీవ్ర నిరాశ తప్పడం లేదు. మరో వైపు కాయ దశలో ఉన్న మినుము పంటపై ఎలుకలు దాడి చేస్తున్నాయి. విచక్షణారహితంగా పంటను దెబ్బతీస్తున్నాయి. కాయ, గింజ గట్టిపడే దశలో ఎలుకలు దాడిచేసి పంటకు నష్టం చేకూరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకలు పట్టేందుకు ఒక్కో ఎలుకకు సంచార జాతులవారు రూ.30 వరకూ వసూలు చేస్తున్నారు. పంట దెబ్బతినడంతోపాటు, యాజమాన్యానికి అదనపు పెట్టుబడి వెచ్చించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మూషికాల బెడద నుంచి పంటను కాపాడుకునే పనిలో రైతులు నిమగ్నమవుతున్నారు.

సాగంతా నిరాశాజనకం..



గతంతో పోలిస్తే మినుములో ఈ ఏడాది తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. దిగుబడులు పూర్తిగా తగ్గాయి. నేను 20 ఎకరాలు కౌలు చేస్తున్నా. ఎకరాకు 6 నుంచి 7 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చేలా ఉంది. పెట్టుబడి మాత్రం ఎకరాకు రూ.40 వేలు వరకూ అయ్యింది. దీనికితోడు ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. పక్కనే ఉన్న దాళ్వా వరి పొలాల్లో ఉన్న ఎలుకలు మినుము పైరును నష్టపరుస్తున్నాయి. దీంతో దిగుబడులు మరింత తగ్గే అవకాశం ఉంది.

–మసిముక్కు సాంబశివరావు, కౌలురైతు, దావులూరు

ఎయిర్‌పోర్ట్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



ఎయిర్‌పోర్ట్ నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

దావాజిగూడెం(గన్నవరం): విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు కోల్పోయి అద్దె గృహాల్లో నివాసం ఉంటున్న నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే అద్దె బకాయిలు చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం సీపీఎం నాయకులు మండలంలోని దావాజిగూడెం హరిజనవాడలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్వాసితులు తమ గోడును విన్నవించుకున్నారు. విమానాశ్రయ విస్తరణలో 423 కుటుంబాలు ఇళ్లు కోల్పోతున్నాయని చెప్పారు. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద గృహాలు నిర్మించి ఇస్తామనే హామీని ప్రభుత్వం ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ డ్రెయిన్ నిమిత్తం 48 ఇళ్లను అధికారులు తొలగించారని చెప్పారు. తమకు ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా అద్దె బకాయిలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు వారికి అండగా సీపీఎం పోరాడుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లంపల్లి ఆంజనేయులు తెలిపారు. నాయకులు బడుగు మరియదాసు, ఎంఎస్ బ్రహ్మచారి, మిరప నాగేశ్వరరావు, ఏసుదాసు, తాతబ్బాయి పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం



గంగూరులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏపీ ఖాదీ బోర్డు డైరెక్టర్ గీవ్

పెనమలూరు: యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ఖాదీ, గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.గీవ్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఖాదీ గ్రామీణాభివృద్ధి కమిషన్, ధనేకుల ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకత అభివృద్ధి, ప్రజా విద్యపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గీవ్ మాట్లాడుతూ.. ఉపాధి కల్పించటం, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్తువులు ఉత్పత్తి చేయటం, బలమైన గ్రామ సమాజం నెలకొల్పటం తమ సంస్థ ప్రధాన ఉద్దేశమన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్లు ఆనంద్‌కుమార్, వి.కోటిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించి యువతను ప్రోత్సహించటమే లక్ష్యమన్నారు. స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా స్థిరపడటానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కాలేజీలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మొల్లమాంబ జయంతి



నున్న(విజయవాడరూరల్): రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన ప్రముఖ కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమం గురువారం నున్న గ్రామంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కుమ్మర, శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. శాలివాహనుల కులదైవం మొల్లమాంబ విగ్రహాన్ని త్వరలో నున్న గ్రామంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో విజయవాడ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి డీఎస్ఎస్ మూర్తి, నున్న గ్రామ కమిటీ సభ్యులు సుంకర సాంబశివరావు, సుంకర శివశంకర్, యనగంటి శివ, బొమ్మిన శివ, ఏ చంద్రయ్య పాల్గొన్నారు.

నున్నలో కామన్ స్థలాలను పరిరక్షించాలి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రియల్ ఎస్టేట్ వెంచర్ల ద్వారా గ్రామ పంచాయతీకి సంక్రమించిన కామన్ స్థలాలను పరిరక్షించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ దండు సుబ్రహ్మణ్యంరాజు కోరారు. ఈ మేరకు విజయవాడ సబ్‌కలెక్టర్ కావూరి చైతన్యను ఆయన కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్థలాలు అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్తలు చేపట్టడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ఘనంగా గుడ్ల గౌరమ్మ తల్లి వార్షిక సంబరాలు



గన్నవరం: మండలంలోని మర్లపాలెం శివారులో కొలువైన శ్రీగుడ్ల గౌరమ్మతల్లి ఆలయంలో గురువారం వార్షిక సంబరాలను ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేష అలంకరణలు జరిపి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి పాల పొంగళ్లను నివేదనగా భక్తులు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీగుడ్ల గౌరమ్మతల్లిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహానివేదన తర్వాత హారతి కార్యక్రమం జరిపారు. అనంతరం గ్రామ భక్త కమిటీ ఆధ్వర్యంలో ఆరు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

రక్తదానం ప్రాణాలను కాపాడుతుంది

నున్న(విజయవాడరూరల్): రక్తదానం ప్రాణాలను కాపాడుతుందని వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి అన్నారు. నున్న గ్రామంలోని వికాస్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం జరిగింది. చైర్మన్ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. 118 విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలబెట్టుతుందన్నారు. అకాడమిక్ డైరెక్టర్ ఎన్.కీర్తిరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధిపతి దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుసు దొంగకు మూడు నెలలు జైలుశిక్ష

ఉంగుటూరు: మహిళ మెడలో బంగారం గొలుసు లాక్కుని పారిపోయి దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి మూడు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జూలై 2024 సంవత్సరంలో తేలప్రోలు గ్రామంలో ఓ మహిళ(74) హైస్కూల్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి స్కూటీపై వచ్చి ఆమె మెడలోని బంగారు(నాంతాడు)గొలుసు దొంగిలించుకుపోయాడు. ఆమె ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ పైడిబాబు విచారణ చేపట్టారు. నేరానికి పాల్పడిన పాత నేరస్తుడైన రౌతు నాగిరెడ్డిగా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఈ కేసుతో పాటు ఇతర కేసుల్లో దొంగిలించిన సొత్తునంతా రికవరీ చేసి గన్నవరం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. ఏపీపీ టి.మాధవి వాదనలు వినిపించి సాక్షులను హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువుకావడంతో నిందితుడికి మూడు నెలు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బి.శిరీష తీర్పునిచ్చారు.

చైతన్య కళాశాల వద్ద ఆందోళన

రామవరప్పాడు: గూడవల్లిలోని శ్రీ చైతన్య కళాశాల రామన్ భవన్-2 వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళన నిర్వహించారు. తమ పిల్లలకు టీసీలు కావాలని కోరిన ఇవ్వకుండా కళాశాల సిబ్బంది అధిక ఫీజులు చెల్లించమంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. మొదటి సంవత్సరం ఫీజును మొత్తం చెల్లించినా, టీసీలు కావాలంటే అదనంగా రూ.30 వేలు కట్టాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. రెండో సంవత్సరం కూడా తమ కళాశాలలోనే విద్య అభ్యసించాలని అప్పుడే ఫీజులు చెల్లించనవసరం లేదంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు.

వైభవంగా తిరుపతమ్మ తిరునాళ్ల



శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ



ప్రభోత్సవం

పెనమలూరు: కానూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారి తిరనాళ్ల వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అమ్మవారికి పొంగళ్లు, బోనాలు సమర్పించారు. భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచి మేళ తాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి మొక్కుబడులు చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావటంతో అమ్మవారి దర్శనానికి గంటల సమయం పట్టింది. భక్తులకు ఉచితంగా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సందడిగా ప్రభోత్సవం..

అమ్మవారి ఆలయం వద్ద గురువారం రాత్రి దివ్య ప్రభోత్సవం నిర్వహించారు. గ్రామంలో పలు ప్రభలు ప్రత్యేక వాహనాలపై ఏర్పాటు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ప్రభలకు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మేళతాళాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ వారి వార్షిక శాంతి కల్యాణోత్సవం గురువారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు పూరకరణం పవన్‌కుమార్‌శర్మ ఘనంగా చేశారు. భక్తులు అమ్మవారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. కల్యాణం అనంతరం గ్రామోత్సవం జరిగింది. బ్రహ్మశ్రీ కుంభంనాటి పార్థసారథి ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పనకు వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు గురువారం తెలిపారు. మండలంలో మొత్తం 92 యూనిట్లకు గానూ, రూ.206.50 లక్షల మేరకు రుణాల మంజూరుకు కేటాయింపులు జరిగాయన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 60 యూనిట్లకు రూ.114.50 లక్షలు జెనిరిక్ ఫార్మసీ ఏర్పాటుకు రూ.8 లక్షలు, కాపు కార్పొరేషన్ ద్వారా 17 యూనిట్ల ఏర్పాటుకు రూ.57 లక్షలు, మేదర, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్లకు రూ.6 లక్షల చొప్పున కేటాయింపులు జరిగాయని ఎంపీడీవో చెప్పారు. కమ్మ కార్పొరేషన్‌కు రూ.9 లక్షలు, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, ఈబీసీ కార్పొరేషన్లకు రూ.1.50 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేసేందుకు కేటాయింపులు జరిగాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెల్లరేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలని, 21 నుంచి 60 ఏళ్ల లోపు వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవాలు



నున్నలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



గన్నవరంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

నున్న(విజయవాడరూరల్): నున్నలో వేంచేసి ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వర స్వామివార్ల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం స్వామి వార్ల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామి వార్లను పల్లకిలో గ్రామ వీధుల్లో ఊరేగించుకుంటూ చెరువు సెంటర్‌కు తీసుకువచ్చారు. అక్కడ రాయబార కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం స్వామి అమ్మవార్లను ఆలయానికి తీసుకు వచ్చి కల్యాణోత్సవం జరిపారు. శ్రీలలితా త్రిపుర సుందరీదేవి పీఠాధిపతి మునీంద్ర మహారాజ్, ఆలయ ప్రధానార్చకులు, శివాచార్య డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ నేతృత్వంలో కల్యాణోత్సవం జరిగింది. కల్యాణోత్సవంలో ఈఓ హేమలతాదేవి, దేవదాయ శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్న కల్యాణ మహోత్సవం

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో గురువారం అమ్మవారి వార్షిక చిన్న కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీలక్ష్మీతిరుపతమ్మకు పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మీ)కి పూజలు నిర్వహించి పాలపొంగళ్లు సమర్పించారు. రాత్రి 7 గంటలకు సముహూర్తంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి వార్లకు వేదపండితుల మంత్రోచ్ఛరనల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. కాసన్నేని వెంకటేశ్వరరావు(చిన్న నాని), స్వరాజ్యధనలక్ష్మి కన్యదాతలుగా వ్యవహరించి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ మాతృమండలి సభ్యులచే నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ఈఓపీలపై పనిభారం, ఒత్తిడి తగ్గించాలని వినతి

గన్నవరం: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న అధిక పనిభారం, ఒత్తిడిని తగ్గించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ టి.స్వర్ణలతకు పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ మండల అధ్యక్షురాలు సరోజిని నేతృత్వంలో ఈఓలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సరోజిని మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగిస్తున్న వివిధ రకాల సర్వేలు, కార్యక్రమాలతో తీవ్ర పని భారానికి గురవుతున్నామన్నారు. సెలవుల్లో, పండుగ రోజుల్లో కూడా పని చేయాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. దీనివల్ల నెలలో ఒక్క రోజు కూడా కుటుంబ సభ్యులతో గడపలేకపోతున్నామని వాపోయారు. పని ఒత్తిడి కారణంగా అనారోగ్య సమస్యలతో పాటు మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధిక పని భారం, ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు అదనపు ఆర్థిక సాయం



ఉయ్యూరురూరల్: ఎన్టీఆర్ గృహ నిర్మాణ కాలనీలో అసంపూర్తిగా మిగిలిన గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో శేషగిరిరావు సూచించారు. మండలంలోని కాటూరులో లబ్ధిదారులతో గురువారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం యూనిట్ ధరను ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ తరగతులు



పెనమలూరులో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనమలూరు: మండల పరిధిలో మూడు రోజులుగా జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. పోషన్‌బి, పడాయిబి శిక్షణ తరగతుల్లో తల్లులు, చిన్నారులు, గర్భిణుల పోషణ, తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేయటంపై అవగాహన కల్పించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగటానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యేక అవసరాల చిన్నారులకు సంక్షేమం, వైద్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.శ్రీలత గురువారం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు పేద మహిళలకు అండగా నిలవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, పోషకాహారం సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఉయ్యూరురూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల పట్ల అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కంకిపాడు సీడీపీఓ బేబీ సుకన్య సూచించారు. మండలంలోని పెద ఓగిరాల ఎంపీపీ పాఠశాలలో మూడు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. దీనిలో భాగంగా సీడీపీఓ బేబీ సుకన్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులు, బాలింతలు, గర్భిణుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ప్రత్యేక శ్రద్ధతో విద్యాబుద్ధులు నేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పడాయి బీ - పోషణ్ బి శిక్షణలో తెలుసుకున్న అంశాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న కిట్లను అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అన్నామణి, బేబీ సరోజిని పాల్గొన్నారు.

పోషణతో పాటు నాణ్యమైన విద్య అందించాలి

ఉంగుటూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని సీడీపీవో వెంకటలక్ష్మి అన్నారు. ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ, పడాయిబీ శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. సీడీపీవో పోషణ, నాణ్యమైన విద్య అందించడంపై పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు పద్మాదేవి, దుర్గాదేవి, హెచ్‌ఎం సుధాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో రోడ్లు వేయండి



వణుకూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

పెనమలూరు: వణుకూరు జగనన్న కాలనీలో రోడ్లు వేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ కాశిం మాట్లాడుతూ వణుకూరు జగనన్న కాలనీ - 1లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలన్నారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వానికి స్థానికులు మొరపెట్టుకున్నా నేటికి చర్యలు తీసుకోలేదన్నారు. రహదారులు సక్రమంగా లేకపోవటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగనన్న కాలనీలో డ్రెయినేజీలు లేకపోవటంతో వర్షం నీరు, మురుగునీరు పారుదల కావడం లేదన్నారు. ఈ మేరకు స్థానికులతో కలిసి సంతకాలు సేకరించారు. సమస్యలను మరోసారి తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, నాయకులు జువ్వనపూడి వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ నాగమణి, వేణు తదితరులు పాల్గొన్నారు.

16న మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.స్వర్ణలత గురువారం తెలిపారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. మండల ప్రజాప్రతినిధులు, మండల ప్రజాపరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు, ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ఉంగుటూరు: చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై ఆత్కూరు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు విజయనగరం జిల్లా విప్పలవలస గ్రామానికి చెందిన జామీ శ్రీనివాసరావు(60) ఆత్కూరులోని మేనల్లుడి కుమార్తె ఓణీల ఫంక్షన్‌కు వచ్చాడు. స్వగ్రామానికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా అదే సమయంలో గన్నవరం వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఏఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటీతత్వంతో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్ యశోదలక్ష్మి

గన్నవరంరూరల్: పోటీతత్వంతో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి అన్నారు. గురువారం విద్యా సంవత్సరం బోధన ముగింపు సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం ఏర్పాటు చేసిన విద్యార్థుల బ్లూ, గ్రీన్, రెడ్, ఎల్లో హౌస్‌ల ప్రగతిని సమీక్షించారు. ఆయా హౌస్‌ల ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రారంభంలోనే విభజన చేసి సంవత్సర కాలంలో వారు సాధించిన మార్కులు, అవార్డులు, ప్రగతిని నమోదు చేశారు. వాటిని పరిశీలించగా గ్రీన్ హౌస్, రెడ్ హౌస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరిని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రోఫీలు, విన్నర్స్‌కు కిరీటాలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో పోటీతత్వం పెంచి మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ కృషి ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నున్న(విజయవాడరూరల్): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి డీఎల్‌పీఓ, ఈఓఆర్డీ ఎంపీడీ ప్రసాద్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. నున్న గ్రామంలో జరుగుతున్న నీటి సరఫరా స్థితిగతులను గురువారం డీఎల్‌పీఓ పరిశీలించారు. అనంతరం గ్రామంలో వాటర్ ట్యాంక్‌లను ఆయన సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ప్రతి రోజు గ్రామ ప్రజలకు ఎన్ని లీటర్ల నీటి సరఫరా చేస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలాఖరు నాటికి నూరు శాతం ఇంటి పన్ను వసూలు జరగాలని, ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని చెప్పారు.

భూసమ్మ తల్లికి బోనాల సమర్పణ

ఉయ్యూరు రూరల్: మండలంలోని ముదునూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భూసమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం మూడు రోజులుగా కనులపండువగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారికి సంప్రదాయంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం నుంచి బోనాలు సమర్పణ కార్యక్రమం కోలాహలంగా సాగింది. డప్పు దరువులు, యువత చిందులు నడుమ పంచాయతీ సర్పంచ్ మొవ్వ వెంకట నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ మొవ్వ జ్ఞాన శేఖర్ దంపతులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, కార్యదర్శి సుబ్బారావు, నేతలు దండమూడి చౌదరి, ఆళ్ల శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామం వసంతనగర్‌లో జి.రాజేష్ అనే వ్యక్తి అతని తల్లి బసవలక్ష్మితో కలిసి నివాసం ఉంటున్నాడు. రాజేష్ విజయవాడలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. బసవలక్ష్మి మానసికస్థితి సరిగా లేకపోవటంతో అదృశ్యమైంది. ఆమె కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో మహిళపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన గూడవల్లి మోహిని భర్త వెంకటరత్నంతో కలిసి కాలువ కట్టపై నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఆమె ఇంటి పక్కనే ఉంటున్న షేక్ సుభాని ఆటోనగర్‌లో పని చేస్తాడు. అతను తరచుగా మద్యం సేవించి వచ్చి స్థానికులతో అకారణంగా గొడవపడి దూషిస్తాడు. కాగా సుభాని దారికి అడ్డుగా బకెట్ పెట్టడంతో మోహిని భర్త వెంకటరత్నం బకెట్ తీయమని అడిగాడు. దీంతో సుభాని ఆగ్రహంతో వెంకటరత్నంతో గొడవపడ్డాడు. గొడవను ఆపేందుకు మోహిని అడ్డుగా వెళ్లగా ఆమెపై దాడి చేశాడు. బాధితురాలు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.